క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు



గట్టు: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎండీ గౌస్, మహబూబ్‌పాషలు బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడును కలిశారు. ఇటీవల నూతనంగా టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఎంపికైన మహేష్ కుమార్‌గౌడును సన్మానించి, అభినందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉందని, వెంటనే భర్తీ చేయాలని కోరారు. త్వరలోనే తాను గద్వాలకు వస్తానని, అన్ని సర్దుకుంటాయని అప్పటి దాకా సీనియర్లు సంయమనం పాటించాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. అనంతరం నాగర్‌కర్నూలు ఎంపీ మల్లురవిని, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లాకోత్వాల్‌ను కాంగ్రెస్ నాయకులు కలిశారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థిని



మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన విద్యార్థిని రుబికా జాతీయ స్థాయి లో సత్తా చాటింది. గ్రామానికి చెందిన గోకారన్న సువార్తమ్మ దంపతుల కుమార్తె రుబికా ఐకార్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగంలో జాతీయ స్థాయిలో 383వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 48వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. జాతీయ స్థాయిలో అగ్రికల్చర్ విభాగంలో అత్యుత్తమ ఫలితాన్ని సాధించడంపై రుబికాను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

రోడ్డు మరమ్మతు చేయాలని వినతి



ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి తక్కశిల వయా ప్రాగటూరు గ్రామానికి వెళ్లే మార్గం గుంతలమయంగా మారిందని ఉపాధ్యాయులు ఎంపీడీఓ తిరుపతన్నకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం, తక్కశిల, ప్రాగటూరు గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లు బురదమయంగా మారాయన్నారు. సింగల్ రోడ్డు కావడంతో ప్రజలకు, విద్యార్థులకు మురుగుతో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, ఖాజాబాషా, దాదామియ్యా, దామోదర్ గౌడు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ పరిశీలన



ఉండవెల్లి: మండలంలోని బస్వాపురంలో ఎంపీడీఓ తిరుపతన్న పోలింగ్ బూతులను, అంగన్వాడీ కేంద్రాలను, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

ఊట్కూర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారం



అలంపూర్ రూరల్: మండలంలోని ఊట్కూర్‌లో ఎన్నో ఏళ్లుగా ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను ఏఈ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఏఈకి వివరించారు. స్పందించిన ఏఈ వేలాడుతున్న తీగలను తొలగించి, నూతన 3 పోల్స్‌ను కొంత దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు పథకాలు అందించాలి

గద్వాల: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు పథకం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

వంతెనలకు మోక్షమెప్పుడో?

- వర్షకాలం ప్రారంభంతో ప్రజలకు తిప్పలు
- వర్షం కురిస్తే రాకపోకలకు బంద్
- ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చని బ్రిడ్జి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మానవపాడు: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న హైలెవల్ వంతెనల నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పడమే తప్ప, కార్యరూపం దాల్చడం లేదు. పల్లెపల్లెకు అనుసంధానంగా ఉండే గ్రామీణ రోడ్ల వెంట వాగులు, వంకలపై హైలెవల్ వంతెనలు (బ్రిడ్జి) లేక ప్రయాణికులకు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన బీటీ రోడ్ల మధ్య వాగులపై వంతెనలు లేక రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాలు వచ్చినప్పుడు కల్వర్టులు లేని వాగుల వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ, రాకపోకలు స్తంభిస్తున్నాయి.



మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య వంతెనపై పారుతున్న వర్షపునీరు

రాకపోకలు నిలిచిపోతున్న గ్రామాలు

మండలంలో మానవపాడు- అమరవాయి గ్రామాలకు వెళ్లే దారి, మానవపాడు - గోకులపాడుకు, చెన్నిపాడు నుంచి కొర్విపాడు, చెన్నిపాడు బొంకూరుకు, మానవపాడు- చెన్నిపాడు, అమరవాయి- పెద్ద ఆముదాలపాడు, బోరవెల్లి-జల్లాపురం, అమరవాయి-కలుకుంట్ల గ్రామాల వాగులపై బ్రిడ్జి నిర్మాణాలు లేక అవస్థలు తప్పడం లేదు. అధికారులు చొరవ చూపి హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ వంతెనలు నిర్మించండి



మండలంలోని అమరవాయి-మానవపాడు మధ్య వాగులపై వంతెన నిర్మించాలి. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వెళ్లేందుకు వాగు పారే సమయంలో అంతరాయం తప్పదు. అధికారులు, పాలకులు చొరవ చూపి హైలెవల్ వంతెన నిర్మించాలి.

– గొల్ల వెంకట్రాముడు, మానవపాడు

వాగులు, వంకలు దాటలేక..



ప్రభుత్వాలు మారుతున్నా హైలెవల్ వంతెనలు పూర్తి కావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నారు. వర్షాలు కురిస్తే వాగులు, వంకలు దాటలేక విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– భీమరాజు, గోకులపాడు

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో వంతెనల నిర్మాణం చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులకు నివేదికలు సైతం ప్రతిపాదించాం. నిధులు మంజూరైతే నిర్మాణం చేపడతాం. చెన్నిపాడు-పెద్ద పోతులపాడు బ్రిడ్జి నిర్మిస్తున్నాం.

– రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ జేఈ, అలంపూర్

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన రవీందర్, అనూషలు కులాంతర వివాహం చేసుకోవడంతో ప్రభుత్వం వారికి రూ.2.50 లక్షలు మంజూరు చేసింది. మానవపాడు మండల కేంద్రానికి చెందిన రఫీ, జ్యోతిలు కులాంతర వివాహం చేసుకోవడంతో రూ.2.50 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సరోజిని, సుజాత ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పాఠశాలలో ఆర్వోప్లాంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

13వ ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఐసీఈయూ నాయకులు

గద్వాలన్యూటౌన్: ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు బెంగళూర్‌లో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎస్‌సీజెడ్ఈఎఫ్) 13వ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు తెలిపారు. బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఐసీఈయూ ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ యూనియన్, సౌత్ సెంట్రల్ ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు పాల్గొంటారని చెప్పారు. యూనియన్ అన్ని విభాగాల నాయకులు కాన్ఫరెన్స్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సూరజ్, ఎల్ఐసీ ఉద్యోగులు పద్మావతి, నర్సింగ్ కిషోర్, చంద్రశేఖర్, మల్లికార్జున్, రాఘవేంద్ర, లక్ష్మీకాంత్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించాలి



పరిసరాలను పరిశీలిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గద్వాల రూరల్: గద్వాల పట్టణ సమీపంలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్కూల్‌ను సందర్శించి అ క్కడి సమస్యలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్‌లో 120మంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు, నీటి వసతి, సరిపడ ఉపాధ్యాయులు లేకపోవడం, శిథిలావస్థకు చేరిన భవనం, స్కూల్ ఆవరణలో అపరిశుభ్రతతో పాములు సంచరిస్తూ విద్యార్థులు కాటేస్తున్నాయని తెలిపారు. వెంటనే అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌కు వెంటనే సొంత భవనం నిర్మించాలని, 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాన్, నరేంద్ర, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

లో ఓల్టేజీ నియంత్రణకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ అధికారులు

గద్వాల రూరల్: మండలంలోని పూడూరులో రైతులకు, వినియోగదారులకు లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం సబ్ స్టేషన్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు రమేష్ బాబు, నవీన్ బాబు, నాగరాజు, రూరల్ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

15న మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ముస్లిం పెద్దలు

గద్వాల అర్బన్: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో ఒంటెల పేటలోని మజీద్-ఏ-అన్వర్‌లో మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ షఫీవుల్లా విడుదల చేసి మాట్లాడారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మజీద్ ఏ అన్వర్‌లో ఈనెల 15న రాత్రి 9గంటలకు మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. 16న జిల్లా కేంద్రంలోని నల్ల కుంట నందు జల్సా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జులూస్ చేపట్టనున్నామని, అధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హజరత్ సయ్యద్ షా సుల్తాన్ మొహిద్దీన్ ఖాద్రీ, ఫారుక్ పాష, తజమ్ముల్, చాంద్ పాష, నూర్ సలాం, మజీద్ పెద్దలు, మత పెద్దలు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్

మల్దకల్: మండలంలోని మేకలసోంపల్లి, బిజ్వారం గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకులు ఆశన్న, వెంకటన్నలను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పరామర్శించారు. వారి వెంట శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అచ్చన్న గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గద్వాల: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వివిధ ప్రజాసంఘాలు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్మృతివనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గద్వాల మండలానికి చెందిన ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను అరెస్టు చేసి, కఠిన శిక్షపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో గద్వాల పట్టణంలో న్యూడ్‌ఫోన్ కాల్స్ వ్యవహారంలో అసలు నిందితులను తప్పించుకునేలా అప్పట్లో కొందరు అధికారులు సహకరించారని పేర్కొన్నారు. తాజాగా ఇద్దరు బాలికలపై జరిగిన లైంగిక దాడిలో కూడా నిందితులకు వెన్నుదన్నుగా నిలిచే నాయకులను గుర్తించి వారిపై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. అసలు దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, హనుమంతు, ఇమ్మనియోల్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

చీని పంటను కాపాడాలి



గట్టు: చీని పంటను కాపాడాలని గట్టుకు చెందిన రైతు వెంకట్రాములు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా వర్షపు నీటి నిల్వ కారణంగా చీని తోట దెబ్బతింటున్నట్లు రైతు వాపోయాడు. గట్టు శివారులోని సర్వే నెంబర్ 113లో 4 ఎకరాల్లో చీని తోటను పెట్టుకున్నట్లు రైతు తెలిపారు. తోట పైభాగంలో భారత్‌మాల రోడ్డు నిర్మాణం కారణంగా తాను సాగు చేసిన చీని తోటపై వర్షపు నీరు నిల్వ ఉందని, నీటిని కిందకు వదిలేందుకు పక్క పొలానికి చెందిన రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో చీని తోటలో నీటి ఊట పెరిగి కాపుకొచ్చిన తోట దెబ్బతినే అవకాశం ఉన్నట్లు రైతు వాపోయాడు, ఆగిన నీరు బయటకు వెళ్లడానికి కాల్వ తీయాలని భారత్‌మాల అధికారులకు పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదని రైతు వాపోయాడు. పక్క పొలానికి చెందిన రైతుకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి పరిహారం అందలేదు. దీంతో ఆగిన నీరు కిందకు వెళ్లకుండా అడ్డుకుంటున్నట్లు రైతు వాపోయాడు. అధికారులు స్పందించిన కాపుకొచ్చిన తన చీని మొక్కలు చనిపోక ముందే స్పందించి, న్యాయం చేయాలని రైతు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దటి



వ్యవసాయ పొలాల నుంచి బైక్‌పై నీళ్లు తీసుకొస్తున్న ప్రజలు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ ద్వారా గ్రామానికి వచ్చే తాగునీటికి కొందరు మోటార్లు ఏర్పాటు చేసుకోవడంతో కొన్ని వార్డులకు మాత్రమే నీరు సరఫరా అవుతోంది. నీటి కోసం ప్రజలు వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మోటార్లు తీసేసి అందరికి మిషన్ భగీరథ నీళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



- పూజలు చేసిన ఎమ్మెల్యే విజయుడు

అయిజలో వినాయకుడి ఊరేగింపులో భక్తులు

అయిజ: మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని భూంపురంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వినాయకుడికి పూజలు చేశారు. మండపాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం వివిధ వాహనాలపై గణపతులను ఊరేగించారు. యువత ప్రత్యేక దుస్తులు ధరించి, నృత్యం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రధాన రహదారుల్లో శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. రాత్రి వివిధ కాలువలు, చెరువులు, రిజర్వాయర్‌లలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు చింతలకుంట, నందిన్నె, కుచినెర్ల, పాతపాలెం గ్రామాల్లో వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. లడ్డు వేలం పాట నిర్వహించగా చింతలకుంట వినాయకుని దగ్గర రఘు కుమార్‌శెట్టి రూ.21 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జనం చేశారు. ముందుగా లడ్డు, పచ్చిటెంకాయలు, చెరుకుగడలు, వస్త్రాలు, ఫలాలు వేలంపాట నిర్వహించారు. జిల్లెడుదిన్నెలో ఆంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద లడ్డును రూ.42 వేలకు వడ్డె స్వాములు, చిన్నలడ్డును రూ.18 వేలకు రవిరెడ్డి కైవసం చేసుకున్నారు. అనంతరం బీచుపల్లి సమీపంలోని కృష్ణానదిలో, మరికొందరు రాజోళి సమీపంలోని తుంగభద్రలో గణేశులను నిమజ్జనం చేశారు.

గట్టులో లడ్డు వేలం

గట్టు: మండల కేంద్రంలోని సగర వీధిలో లడ్డు వేలం నిర్వహించారు. లడ్డు వేలం పాటలో గట్టుకు చెందిన తంగెలగడ్డ మహాదేవ్ అత్యధికంగా రూ.4216లకు దక్కించుకున్నారు. ఎలుక పండును మంగలి పెద్ద నర్సింహులు రూ.1116లకు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగించి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



శాంతినగర్‌లో..



రాజోళి శ్రీరామ్‌నగర్ కాలనీలో బహుమతులను అందిస్తున్న ఎస్ఐ జగదీష్

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉదయం నుండే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, పోటాపోటీగా లడ్డు వేలం పాట నిర్వహించారు. చిన్నారులకు, మహిళలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు.

అలంపూర్ రూరల్: మండపాలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు పూజించారు. మండపాల దగ్గర ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్ఐ బాషా చర్యలు చేపడుతున్నారు. వినాయకులు భక్తులు ఊరేగించి అనంతరం నదిలో నిమజ్జనం చేశారు.



రాజోళిలో సుంకేసుల డ్యాంకు నిమజ్జనాకి వెళ్తున్న గణనాథుడు

వాడవాడలా గణేశ్ ఉత్సవ శోభ

గద్వాలటౌన్: విఘ్నాలు తొలగించే వినాయకుడిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు రోజుకో పద్ధతిలో పూజలు నిర్వహిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. గద్వాల పట్టణంలో మండపాల దగ్గర వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పలు వినాయకుని మండపాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ప్రత్యేక పూజల్లో ఉన్నారు. అన్ని గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.



గణేశ్ మండపంలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

బడికి దూరమైతే భవిష్యత్ ఆగమే

కేటీదొడ్డి: విద్యార్థులు బడికి దూరమైతే భవిష్యత్ ఆగమవుతుందని హెచ్ఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని మల్లాపురం పాఠశాలలో ఎంవీఎఫ్ సభ్యులు కిరణ్ ఆధ్వర్యంలో బడిబయటి పిల్లలపై ఒక్కరోజు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడికి పంపకుండా వ్యవసాయపనులకు తీసుకెళ్లటం మంచిది కాదని తల్లిదండ్రులకు సూచించి, వివిధ పనుల్లో ఉన్న 51 మంది పిల్లలను బడికి తీసుకొచ్చినట్లు తెలిపారు. టీఎల్ఎం ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.



బడిబయట పిల్లలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మల్దకల్: గ్రామ పరిసరాలతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మద్దెలబండ పెద్దతండాలో పరిసరాల పరిశుభ్రతపై కళాజాత బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు రేలారే ప్రసాద్, రాహుల్‌లు బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దెలబండ పెద్దతండాలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు